## చిట్టికథల పోటీలో రూ. 150 బహుమతి పొందిన కథ :

# బొమ్మ కంటైనేరు

చాలాకాలం తర్వాత, సంక్రాంతి పండుగకని తమను చూడవచ్చిన నన్ను చూడగానే అంతులేని ఆనందంతో ఆహ్వానించారు పెద్దమ్మా పెదనాన్న మావారు నాతోపాటు రానందుకు కోప్పడ్డారు కూడా. ఆయన ఆఫీస్ పనిమీద ఢిల్లీ వెళ్లారనీ మరోసారి యిద్దరం కలిసివస్తామనీ నచ్చజెప్పాను.

చిన్నతనం నుంచీ నగర జీవితానికి అలవాటుపడి, ఉద్యోగరీత్యా బొంబేలో ఉంటున్న నాకు ఈ పల్లెటూర్లు పూర్తిగా కొత్త! చెవులు చిల్లులుపడే శబ్దాలమధ్య నుంచి వచ్చిన నాకు ఎంతో నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉన్న ఈ పల్లె ఓ మునివాటికలాగా అనిపించింది. పక్షుల కిలకిలలు, లేగల 'అంబా'లు, ఎడ్లమెడలో మువ్వల గణగణలు ఈ నిశ్శబ్ద చిత్రానికి నేపథ్య సంగీతంలా అనిపిస్తు న్నాయి.

పండుగల శోభ చూడాలి అంటే, అది మన పల్లెలలోనే సాధ్యం! అందులో సంక్రాంతి అంటేనే పూర్తిగా గ్రామీణ పండుగ. ధాన్యలక్ష్మి యిల్లు చేరగానే కష్టించిన రైతుజనం ఎంతో ఉత్సాహంగా, సంబరంగా జరుపు కొనే పండుగ యిది. మేడల నుంచి పూరిళ్ల వరకు ఏ తేడా లేకుండా ప్రతీ వాకిలి ముత్యాల ముగ్గులతో మెరిసిపోతోంది.

మా పెదనాన్నగారి మనుమ రాలు రేవతి ముగ్గులు వేస్తూంటే ఎంతో ముచ్చటగా, ఆశ్చర్యంగా అనిపిస్తుంది. రెండంటే రెండే నిముషాలలో చేతివేళ్లను మెలికలు తిప్పుతూ, ముగ్గు పిండిని జార్చుతూ అద్భుతమైన కళాసృష్టిని చేసేస్తుంది. నాకెంతో ఆశ్చర్యం!

"అమ్మాయ్ సంధ్యా! పూజకి రామ్మా!" పెద్దమ్మ పిలుపుతో ఆలోచనలలోంచి తేరుకుని దేవుడి గది వైపు నడిచాను.

మర్నాడు మధ్యాహ్నం రేవతి నా దగ్గర కూర్చుని మేము వెళ్లవలసిన పేరంటాల గురించీ, చూడాల్సిన ప్రదేశాల గురించి చెప్పసాగింది.

"అవును రేవతీ, నువ్వు ఏడో క్లాసుదాకా చదివి మానేసావన్నావుకదూ? మెట్రిక్‌కట్టి చదవ కూడదూ?" అన్నాను.

"అబ్బా, చదువుగొడవ వద్దు అత్తయ్యా... నాకు యిష్టంలేదు..." అంది బుంగమూతి పెట్టి.

"మరి ముందు ముందు ఏం చేద్దామనీ? నీ వయసు పదహారేళ్లేకదా?"

విచిత్రంగా, కొంచెం అమాయకంగా, ఎంతో జాలిగా నావైపు చూసి, "పెళ్లి!" అని కిలకి లా నవ్వుతూ లోపలికి పారిపోయింది రేవతి.

నివ్వెరపోయాను.

• • •

మూడోరోజు ఉదయం తీరిగ్గా కుంకుడు కాయలరసంతో తలంటు పోసుకుని పెరటి వరండాలో మా పాలేరు భార్య ముత్యాలుతో జుట్టు చిక్కులు తీయించుకొంటూ కూర్చున్నాను. ఇంట్లో ఆడవాళ్లంతా వంటింట్లో బిజీగా ఉన్నారు.

ముత్యాలు కుతూహలంగా పట్నం గురించీ, ఫ్యాషన్ల గురించీ అడగసాగింది.

"అయితే సంజమ్మగోరూ, మీకు జీతమెంతండీ?"

"మూడు వేలు!"

"అయ్ బాబోయ్, మూడేలే? అయితే అల్లుడుగోరికి అయిదేలిస్తారాండీ?"



—ఎస్.ఎస్.నాగమణి

"ఎందుకిస్తారు? తనకీ మూడువేలే. మేమిద్దరం ఒకేపని చేస్తున్నాము!"

"ఆడోరికీ, మొగోరికీ ఒక్కలాగే?" రెండు చేతులతో బుగ్గలు నొక్కుకుంది ఆశ్చర్యంగా.

"ఆ, ఏం, ఎందుకింత ఆశ్చర్యం?"

"అదురుట్టం అంటే మీదేనండి అమ్మాయి గోరూ! మేమూ ఊడుపులకి, కోతలకీ కూలికి ఎల్తామండీ! రోజంతా పని చేస్తే మొగోరికీ ఇరవై యిత్తే, ఆడోరికి పదేనే యిత్తారండి! అన్ని పనులకీ అంతేనేమో అనుకొనీ అడిగానండి! ఏటీ అనుకో కండి?"

"అయ్యో, అదేం లేదుగానీ ముత్యాలూ! యిద్దరూ పొలంలో ఒకే పనిచేసినా కూలితేడా ఉంటుందన్నమాట. ఇది చాలా అన్యాయం కదూ?... ముత్యాలూ, నీకెంతమంది పిల్లలు?"

"ముగ్గురండి!"

"నీ భర్తకి నువ్వంటే యిష్టమేనా?"

"అయ్యో, పేణమండీ! పిల్లలంటే మరీనీ!"

"అయితే చెడ్డ అలవాట్లు..."

"అయ్యేటిలేవండీ, పెద్దయ్య గోరంటే అడికి శానాబయం!"

ముత్యాలును - నా పరిస్థితితో పోల్చిచూసు కున్నాను.

"అబ్బ! నువ్వెంత అదృష్ట వంతురాలివి ముత్యాలూ?" భారంగా నిట్టూర్చాను. ముత్యాలు ప్రశ్నార్థకంగా చూసింది.

"అవును ముత్యాలూ! నాకన్నా నువ్వు ఎన్నోరెట్లు అదృష్టవంతు రాలివి. మీరిద్దరికీ కూలి డబ్బులు తేడా వచ్చినా సుఖసంతోషాల్ని కలిసి పంచుకుంటున్నారు. ఇక్కడ యింత సాదాగా బ్రతుకుతున్న నీ సంతోషం నాకుందా? ఊహు! నాగరికత సుఖసంతోషాల్ని హరించి వేస్తుంది. అక్కడ మా జీతాలు సమానమే. కానీ జీవితాలలో అసమానత! ఇక్కడి నిశ్చింత, తృప్తి మాకు లేవు. అక్కడ చాలామంది మగవాళ్లు నాగరికత పేరుతో మంచినీళ్లలాగా తప్పతాగు తారు. కాలక్షేపం పేరుతో పేకాడు తారు. క్యాబరేలకి వెళ్తారు. లక్షణమైన పెళ్లాంవున్నా బయటి ఆడవాళ్లతో తిరుగుతారు. ఎక్క డుంది, సమానత్వం? నా సంగతే చూడు. అతనిది, నాదీ ఒకటే సంపాదన అయినా ఆడదాన్నిగా పుట్టినందుకు అపరాధ రుసుముగా యాభైవేల రూపాయలు అడ్వాన్సు రూపంలో చెల్లించి, మిగతాది వాయిదాల పద్ధతిలో జీతం రూపంలో ప్రతీనెలా సమర్పించు కుంటున్నాను. ఆడది తెచ్చే డబ్బుకి తప్ప ఆమెకి ఏమాత్రం విలువలేదీ సమాజంలో! అక్కడి ఐస్‌క్రీమ్ కంటే ఇక్కడి గంజినీళ్లు ఎన్నోరెట్లు రుచి! అక్కడ విచ్చల విడిగా సాగే వ్యసనాలకన్నా ఇక్కడ సరదాగా ఆడే కోడి పందాలు ఎన్నోరెట్లు మెరుగు. ముత్యాలూ! అక్కడ ఆడదానికి తన అసంతృప్తిని, ఆవేదనను తల్చుకొని ఒక్కక్షణమైనా ఏడ్చి బరువుదించుకొనే అవకాశం, సమయం రెండూ ఉండవు! ఇక్కడ మీకున్నంత స్వేచ్ఛ మాకులేదు ముత్యాలూ! మేము ఫీలింగ్స్ లేని రబ్బరు బొమ్మలం. మనసులో ఎంత దిగులున్నా పెదవులపై చిరునవ్వులు అంటించుకొని తిరిగే బొమ్మలం!"

అయోమయంగా నా తడికళ్లను చూస్తూండి పోయింది ముత్యాలు! ●